## కథ

# మనసు చేసే గారడి

**వానొస్తే బడికి సెలవు. పిల్లలకు పండుగ. చదువు అటకెక్కుతుంది. అందుకే వానాకాలం చదువులు అంటారు. అలాగే వానొస్తే ఫైలు పక్కన పడేసి వర్షాన్ని చూస్తూ ఉండిపోయే చంద్రరావు వానాకాలం రచయిత! తనో మహారచయిత కావాలన్న కలల్ని హైస్కూలు నుంచి కాలేజీ వరకూ మోసుకొచ్చి ఉద్యోగ సమయంలో కొనసాగించి ఉద్యోగ విరమణ తర్వాత పుంఖానుపుంఖాలుగా రచనలు గుప్పించేయాలని తీర్మానించుకున్నాడు. కానీ ఆంధ్రులు అదృష్టవంతులు. అతడు వట్టి వానాకాలం రచయితగానే మిగిలిపోయాడు!**

కష్టపడో, యిష్టపడో నెలకొక కథ రాస్తూ ఉంటాడు చంద్రరావు. ఏడాదికొకటి ప్రచురించబడుతూ ఉంటుంది! మిగిలిన కథలు క్షేమంగా గూడు చేరుకొని శాశ్వతంగా ఫైలులో నిద్రపోతాయి!

ఒకసారి ఒక పత్రిక కథతోబాటు అడ్రసు కూడా ప్రచురించడంతో వారం గడిచేసరికి ఆయనకు ఐదు ఉత్తరాలొచ్చాయి- నాలుగు కార్డులు, ఒక ఇన్‌లాండ్. నాకూ అభిమానులున్నారు బాబోయ్ అని మురిసిపోయి ముందుగా కార్డులు చదివాడు.

అందరూ కథను పొగిడారు. ఒకరు కథలు రాయడం ఎలా అని అడిగితే ఇంకొకరు కాగితాని కొకవైపే ఎందుకు రాయాలని, నేను ఫలానా పత్రికకు ఇరవై కథలు పంపినా ఒక్కటీ ప్రచురించలేదు, కథల్ని ప్రచురించడంలో కులాలు, రిజర్వేషన్లూ పాటిస్తారా అని మరొకరు అడిగారు.

పాఠకులు ఇలా ఆలోచిస్తారా అని ఆశ్చర్యపోయాడు చంద్రరావు.

నాలుగోది తమాషా ఉత్తరం. 'కథతోబాటు వంద రూపాయల నోటు జత చేశాను. కథ తిరిగి రాలేదు. వంద రూపాయలూ తిరిగి రాలేదు. నా బాధ ఏమంటే కథ ప్రచురించబడలేదు. ప్రచురించడానికి వాళ్ళ రేటెంత? మీరెంత పంపారు?' అని అడిగాడు. పాఠకులు యిలా కూడా ఆలోచిస్తారా అని మరోసారి ఆశ్చర్యపోయాడు చంద్రరావు.

చివరగా ఇన్‌లాండ్ లెటర్-

సుబ్బారావు కూడా తనలాగే రాజమండ్రి నివాసి. రచయిత. తన వయసు అరవై ఐదు అయితే ఆయన వయసు అరవై. తనలాగే బాధ్యతలన్నీ తీరిపోయి విశ్రాంత జీవితం గడుపుతూ కథలు రాస్తున్నాడు. రాజమండ్రిలోని అందరు రచయితలతో పరిచయం ఉందట. మీ పరిచయం చేసుకోవాలని ఉంది. ఎప్పుడు రమ్మంటారు- అని రాశాడు.

అన్ని ఉత్తరాలకూ సముచిత రీతిలో జవాబు రాశాడు చంద్రరావు.

★ ★ ★

నాలుగు రోజులు గడిచాక యింటికొచ్చిన సుబ్బారావుని చూడగానే ఎంతో ఆత్మీయంగా అనిపించింది చంద్రరావుకి. ఎంతో సౌమ్యంగా స్నేహశీలి లాగ కనిపించాడాయన. కబుర్లు చెప్పుకుంటూ డాబామీద వాలుకుర్చీల్లో సెటిల్ అయారిద్దరూ.

పశ్చిమాన కృంగిపోతున్న ఎర్రాఎర్రని సూర్యబింబం, హృదయాన్ని తట్టి ఆత్మీయంగా పలకరిస్తున్న చల్లా చల్లని పిల్లగాలులు, అంత దూరాన ప్రకృతి మాత ధరించిన వడ్డాణం లాగ గోదావరి, ఆ వడ్డాణానికి వేలాడుతున్న ముత్యాల సరాల లాగ మూడు వంతెనలూ, సమీప ఆలయం నుంచి ఎడనెడ వినిపించే మృదు ఘంటారావాలు- అద్భుతంగా వుంది దృశ్యం.

ఆహ్లాద వాతావరణంలో ఇద్దరు రచయితలు కలిసినప్పుడు సాహిత్య చర్చను మించింది ఏముంటుంది.

★ ★ ★

క్రమంగా దృఢపడుతున్న వారి చెలిమి చూపరులకు ఆశ్చర్యమే. ఎందుకంటే-

చంద్రరావొక బద్ధక బంధోపాధ్యాయ! ఇల్లు విడచి ఎక్కడికీ వెళ్ళడు. తప్పని పరిస్థితిలో పెళ్ళి, గృహప్రవేశం లాంటి కార్యక్రమాలకు హాజరైనా, మీటింగ్‌లకు అస్సలు వెళ్ళడు. ఇంటికెవరు వచ్చినా ఆదరిస్తాడుగాని తానుగా ఎవరింటికీ వెళ్ళడు. ఆయనకు పూర్తిగా వ్యతిరేకం- సుబ్బారావు. పట్నంలోని రచయితల, బంధువుల యిళ్ళకు తరుచుగా వెళ్తూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే తత్వం ఆయనది. ఎక్కడ సాహిత్య సభలు జరుగుతున్నా హాజరయ్యే సాహిత్య జీవి.

ఈ తేడా వారిద్దరి రచనల్లోనూ కనిపిస్తుంది.

చంద్రరావు రచనలకు పరిధి తక్కువ. వర్ణనలు లేకుండా సంభాషణ ద్వారా కథ నడుస్తుంది. సుబ్బారావు కథలు అలాకాక విస్తృత పరిధిలో వర్ణనలతో అలరిస్తాయి.

పరిచయం అయిన తొలినాళ్ళలో సుబ్బారావు తరుచుగా చంద్రరావు యింటికొచ్చి- గౌతమి గ్రంథాలయంలో కథాచర్చ ఉంది. ఆనం కళాకేంద్రంలో పుస్తకావిష్కరణ ఉంది. నా స్కూటర్ మీద తీసుకెళ్ళి మళ్ళీ యింటి వద్ద దింపుతాను. వస్తారా అని అడిగేవాడు. చంద్రరావొక నమస్కారం పెట్టేసి నవ్వేసేవాడు.

వైరుధ్యాలు పరస్పరం ఆకర్షించుకుంటాయనడానికి వారి స్నేహమే చక్కని ఉదాహరణ. ఇద్దరికీ పుస్తకాలు కొని చదివే అలవాటుంది. ఇద్దరికీ పుస్తకాలే ప్రాణం. అయితే ఆ పుస్తకాలే వారి మధ్య చిచ్చుపెడతాయని ఎవరనుకున్నారు!

చంద్రరావు వద్ద లేని పుస్తకాల్ని చదవమని తెచ్చి యిచ్చేవాడు సుబ్బారావు. ఒకసారి సంచిలో ఏకంగా పది పుస్తకాలు, ఆ తర్వాత రెండూ, మూడూ- అలా.

పుస్తకాలు, డబ్బూ యితరులకిస్తే మళ్ళీ తిరిగి రావన్న సూక్తి పట్టించుకోని అమాయకుడు. చదివేశారా, నా పుస్తకాలు నాకిచ్చేయండి- అని అడగలేని మొహమాటస్తుడు!

చంద్రరావు కూడా పుస్తకాలు చదివేశాక ఒకటొకటిగా యిచ్చేశాడు.

మూడు, నాలుగు నెలలు గడిచాక మొహమాటాన్ని పక్కకు నెట్టి, నా పుస్తకాలు చదివేశారా? ఇచ్చేస్తారా? అని అడిగేశాడు సుబ్బారావు ఒక రోజు.

నివ్వెరపోయాడు చంద్రరావు. ''అదేమిటీ! పుస్తకాలన్నీ యిచ్చేశాను గదా''

''రెండు, మూడు యిచ్చారు. ఇంకా పదివరకూ యివ్వాల్సి ఉంది. ఒకసారి వెదికి చూడండి'' అంటూ వెళ్ళిపోయాడు సుబ్బారావు.

ఆరోజే చంద్రరావు యిల్లంతా వెదికాడు. పుస్తకాలు కనిపించలేదు. మీకే యిచ్చేశాను. జ్ఞాపకం చేసుకోండి అంటూ ఆయనకుత్తరం రాశాడు.

**ప్రఫుల్లచంద్ర**

వెంటనే జవాబు వచ్చింది.

మీ ఉత్తరం నాకు షాక్ యిచ్చింది. మీరిచ్చినవి కొన్ని పుస్తకాలే. ఇంకా మీ వద్ద పది పుస్తకాలుండాలి అంటూ లిస్టు జత చేసి-

''మీరు కోరకపోయినా నాకు నేనుగా మీ చేత చదివించాలన్న అత్యుత్సాహంతో ఆ పుస్తకాలు మీ యింటికి తెచ్చి యిచ్చాను. నేనెవరికిచ్చినా పుస్తకాలు పోలేదు. ఇప్పుడూ పోవు. మీ యింటి నుంచి పుస్తకాలు తీసుకెళ్ళిన వారు చదివిన మీదట పాపం అమాయకుడు పుస్తకాలు కొనుక్కున్నాడు వాడికే యిచ్చేద్దామని జాలి తలచి సహృదయంతో మీకు తిరిగి యిస్తే నాకు తెలియ జేయండి. వచ్చి తీసుకెళతాను'' అని రాశాడు చివరగా.

ఆ ఉత్తరం చదివి ఖిన్నుడయాడు చంద్రరావు. తన యింటికొచ్చే బంధుమిత్రులు పత్రికల్లోని జోకులు, సినిమా బిట్స్‌తో సంతృప్తిచెందే రకం. నవలలు చదివే ఓపిక లేనివారు. వాళ్ళు పుస్తకాలు తీసుకెళ్ళే సమస్యే లేదు. స్వంత పుస్తకాలే ఎవరికీ యిచ్చే అలవాటు లేని తను యితరుల పుస్తకాలు ఎలా ధారాదత్తం చేస్తాడు! ఒకటి, రెండు అయితే పోయే అవకాశం ఉంది గాని ఏకంగా పది పుస్తకాలెలా పోతాయి!

ఆ ఉత్తరం పదే పదే చదువుకున్నాడు చంద్రరావు. మిత్రుని భాష, ఆవేదన ఆయన్ని కలచి వేశాయి. ఏ రచయితకైనా పుస్తకాలు కన్నబిడ్డల్లాంటివి. పుస్తకం కనిపించలేదంటే కన్నబిడ్డ తప్పిపోయినంత బాధ!




చంద్రరావు మళ్ళీ యిల్లంతా వెదికాడు. పుస్తకాల జాడ లేదు. ఆలోచించాడు. సుబ్బారావు సంచితో పుస్తకాలిచ్చిన నెలరోజులకే అదే సంచితో ఆయనకా పుస్తకాలు ఇచ్చేసినట్టు జ్ఞాపకం. ఆయనా సంచిని స్కూటర్‌కి తగిలించి తీసుకెళ్ళినట్టు గుర్తు.

దారిలో ఆయన సంచిని ఎవరికైనా యిచ్చి మరిచిపోయాడా? స్కూటర్ నుంచి మనుషులే జారిపడిపోతున్నారు. సంచి జారిపడితే ఆయన గమనించలేదేమో!

పరి పరి విధాల ఆలోచించి, ఆ ఆలోచనలన్నీ సుబ్బారావుకి ఉత్తరం రాశాడు చంద్రరావు.

వెంటనే జవాబు వచ్చింది. నేనా పుస్తకాల్ని మరెవ్వరికీ యివ్వనే లేదు. స్కూటర్ నుంచి జారిపోయే ప్రశ్నేలేదు. అసలు మీరా పుస్తకాలు నాకివ్వనే లేదు. అంటూ చివరగా ''మీరడగకపోయినా పుస్తకాలు యిచ్చిన నేరం నాదే కనుక శిక్ష నాకే. ఇంక ఈ విషయం ఆలోచించకండి. మీకు శ్రమ యిచ్చాను'' అని రాశాడు.

చివరి మాటలు శూలం లాగా గుచ్చుకున్నాయి చంద్రరావుకి.

వయసు మళ్ళిన వారి మనసు చాలా గారడీలు చేస్తుంది. అందులో మతిమరుపు ఒకటి కాగా నిజంగా జరిగిన కొన్ని విషయాలు జరగనట్టూ, జరగనివి జరిగినట్టూ భ్రమకు లోను చేసి ఆ భ్రమ మెదడులో నిలిచిపోయేట్టు చేయడం మరో గారడి.

వయసు ప్రభావం వల్ల సుబ్బారావు తను పుస్తకాలు తీసుకోలేదన్న భ్రమకు లోనయాడేమో అనిపించింది చంద్రరావుకు. పుస్తకాలు యిచ్చేసినట్టు తనే భ్రమపడి ఉండొచ్చు కదా అనిపించలేదాయనకు! ఎందుకంటే పుస్తకాలు తన యింట్లో లేవు.


''నేనడగకపోయినా మీరు పుస్తకాలిచ్చారు. అది నేరం కాదు. సాహిత్య పిపాస అలాంటిది. సరే, పుస్తకాలు మా యింటనే పోయాయన్న మీ అభియోగాన్ని అంగీకరిస్తూ పరిహారం చెల్లించ నిర్ణయించుకున్నాను. మీ లిస్టు ప్రకారం కొత్త పుస్తకాలు కొనుక్కోండి. ఆ డబ్బు నేను చెల్లిస్తాను. నిజానికి నేనే కొని మీకు పార్శిల్ పంపడం సముచితంగా ఉండేది. కానీ షాపులకు తిరిగే ఓపిక లేని వాడిని. క్షమార్హుడను'' పరిష్కారం సూచిస్తూ చంద్రరావు రాసిన ఉత్తరానికి ఆ విషయం మరిచి పొండి అని జవాబు.

మరిచిపోవడానికి మనసొప్పక చంద్రరావు వెయ్యి రూపాయిలు యం.ఓ ద్వారా పంపిస్తే తిరి



గొచ్చింది. చేసేది లేక దీర్ఘంగా నిట్టూర్చి ఊరుకున్నాడు. ఆరు నెలలు గడిచాయి. చంద్రరావు యింటికి రావడం మానేశాడు సుబ్బారావు. ఇద్దరి మధ్య ఉత్తరాలూ నిలిచిపోయాయి.

అంతటితో ఆగితే కథే లేదు. కల్పన కంటే వాస్తవమే బహువిచిత్రంగా ఉంటుందనడానికి ఉదాహరణగా-




ఓ ఉదయం పదేళ్ళ కుర్రాడొకడు మా నాన్నగారు యిమ్మన్నారంటూ ఒక సంచి సుబ్బారావు చేతిలో పెట్టి ఆయన నోరు తెరిచి ఏదో అడిగేలోగా తుర్రుమన్నాడు. ఆ సంచిలో- తను పోయాయని నిరాశ చేసుకున్న పుస్తకాలు!

ఆసక్తిగా చూసిన భార్యవైపు తిరిగి ''చూశావా, గురుడు పుస్తకాలు పంపేశాడు'' అన్నాడు సుబ్బారావు సంబరంగా.

నమ్మలేకపోయిందామె. అవేమీ అరుదైన పుస్తకాలు కావు. ప్రతి షాపులోనూ దొరికేవే. పుస్తకాలు అప్పుడే యిచ్చేసి తనే కొత్తవి కొనుక్కోవచ్చు కదా. మరి చంద్రరావుగారు వెయ్యి రూపాయిలెందుకు పంపినట్టు? అని ఆమె అనుమానం.

''ఆయన మహాబద్ధకస్తుడు. వెదక్కుండానే పుస్తకాలు లేవు ఇచ్చేశాను అని కమిట్ అయిపోయాడు. తీరా పుస్తకాలు దొరికాక అహం అడ్డొచ్చి అన్నమాట మీద నిలబడిపోయి డబ్బు పంపాడు'' గుట్టు విప్పిన డిటెక్టివ్ లాగ నవ్వాడు సుబ్బారావు. కానీ ఆ పాయింట్‌లో పస కనిపించలేదు భార్యకు. ''పుస్తకాలు ఎప్పుడో దొరికితే ఆయన యిప్పుడు పంపడం ఏమిటీ?'' దీర్ఘం తీసిందామె.

కాసేపు ఆలోచించాడు సుబ్బారావు. ''ప్రతి మనిషిలోనూ అంతరాత్మ ఉంటుంది. తప్పు చేస్తే అది అలారం లాగ గీ పెడుతుంది. చాలా మంది అలారంని నొక్కేసి, అంతరాత్మని చంపేసి నిద్రపోతారు. కానీ రచయిత అంతరాత్మని చంపుకోలేడు. కాలం గడుస్తున్నకొద్దీ మరింత గట్టిగా మోగుతూ నిద్రలేపే అలారం రచయితలోని అంతరాత్మ. ఆయన నిద్రలేవడానికి ఆరు నెలలు పట్టింది మరి!''

ఏమయితేనేం, పుస్తకాలు పంపినందుకు థాంక్స్ చెప్పాలని చంద్రరావు యింటికి వెళ్ళాడు సుబ్బారావు. వెలిగిపోతున్న ముఖంతో వచ్చిన సుబ్బారావుని చూసి వాలుకుర్చీలో నిటారుగా కూర్చుని ''పుస్తకాలు దొరికాయా? ఎక్కడ దొరికాయి?'' సంభ్రమంగా అడిగాడు చంద్రరావు.

''దొరకడం ఏమిటీ! మీరే పంపారు కదా. అందాయి. థాంక్స్ చెప్పడానికొచ్చాను'' అంటూ కుర్రాడు పుస్తకాలు తెచ్చి యిచ్చిన వైనం చెబుతూ మరో వాలుకుర్చీలో కూర్చున్నాడు సుబ్బారావు.

చంద్రరావు ముఖం మాడిపోయింది ''ఆ కుర్రాడికి చెప్పండి మీ థాంక్స్. నేనా పుస్తకాలు పంప లేదు'' గంభీరంగా అన్నాడు.

ఈయనగారింకా నటిస్తూనే ఉన్నాడనిపించింది సుబ్బారావుకి.

పుస్తకాలు యింతకాలం తన వద్దనే ఉంచుకొని యిప్పుడెవరో యిచ్చారంటూ నాటకాలాడుతున్నాడు సుబ్బారావు- అనుకున్నాడు చంద్రరావు.

ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ఇద్దరికీ అర్థం అయిపోయింది తమ మధ్య కనిపించని తెర ఏదో ఉందని.

★ ★ ★

వయస్సుతో నిమిత్తం లేకుండా మనసు చేసే మరో గారడి- క్లెప్టొమేనియా- దొంగిలించాలన్న కోరిక. ఎంతో గౌరవనీయులు, డబ్బున్న వాళ్ళు కూడా సమీపంలో ఎవరూ లేనప్పుడు అణచుకోలేనంత కోరికకు లోనై దొంగిలిస్తూ ఉంటారు. చాలాకాలం క్రితం మహానటి నర్గిస్ లండన్‌లోని ఒక షాపులో చిన్న వస్తువుని దొంగిలించినట్టు ఆరోజుల్లో ప్రచారం జరిగింది. కొద్దికాలం క్రితం ప్రఖ్యాత క్రికెటర్ సాక్స్ దొంగిలించాడని అభియోగం. ఇవి క్లెప్టొమేనియా లక్షణాలే.

రోజుకొక మంచి పని చేయాలన్నది స్కౌట్లకు ఒక నియమం. అలాంటి నియమం ఏదీ పెట్టుకోకపోయినా ఆ రోజొక మంచిపని చేశానన్న తృప్తితో న్యూస్ ఏజెంట్ రామారావు కాఫీ తాగుతున్నాడు.

ఆ మంచిపని ఏమంటే-

పేపర్ బిల్లుకోసం అతడు చంద్రరావు యింటికి వెళ్ళినప్పుడు ముందుగదిలో ఎవరూ లేకపోవడంతో గోడవారనున్న పుస్తకాల సంచిని సంగ్రహించాలన్న కోరికను అణచుకోలేక దాన్ని చేజిక్కించుకొని చల్లగా జారుకొని తీరికగా ఆరు నెలల పాటు ఆ నవలలు ఒకదాని తరువాత ఒకటి చదువుకొని, వాటిని స్వంతం చేసుకోకుండా వాటిని చంద్రరావుకి యివ్వడానికి మొహమాటపడి, ఒక పుస్తకం మీద రాసి ఉన్న అడ్రసు ప్రకారం వాటిని కొడుకు ద్వారా స్వంతదారుకు అందజేయడమే.

దొంగిలించిన వస్తువుని కొంతకాలం ఉంచుకొని స్వంతదారుకు రహస్యంగా అందజేయడం కూడా క్లెప్టొమేనియా లక్షణమే!

ఈ కథ పూర్తిగా కల్పితం. ఎవరినీ ఉద్దేశించి రాసినది కాదని చెబితే నమ్మలేరా? మీ యిష్టం!

## తెలుగు తెరపై మరో హిందీ నటుడు

**'చంద్రకాంత' టీవీ సీరియల్‌తో వెలుగులోకి వచ్చిన ఇర్ఫాన్ ఖాన్ ఆ తర్వాత బాలీవుడ్‌లో మంచి గుర్తింపుని సంపాదించుకున్నాడు. ఇన్నాళ్లకి అతను కూడా తెలుగు తెరపైకి వస్తున్నాడు. మహేష్ బాబు హీరోగా గుణశేఖర్ దర్శకత్వంలో వస్తున్న 'సైనికుడు' సినిమాలో విలన్‌గా ఇర్ఫాన్ నటిస్తున్నాడు. ఇప్పటికే తెలుగులో ప్రదీప్ రావత్, రాహుల్ దేవ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే లాంటి వాళ్లు విలన్లుగా రాణిస్తున్నారు. మరి ఇర్ఫాన్‌కి ఎలా కలిసొస్తుందో!**

